

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సిబ్బంది పనితీరుపై కమిషనర్ తనిఖీ



**నెల్లూరు కార్పోరేషన్, జులై 3 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వైఓ.నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రల్ సెంటర్ విభాగం పనితీరును శుక్రవారం పరిశీలించారు. కంట్రోల్ సెంటర్ ద్వారా అందిస్తున్న వివిధ సేవలను పర్యవేక్షించారు. స్వచ్ఛ సర్వక్షణ్, ఎస్ఐఆర్ పురోగతి అంశాలపై వారు సచివాలయ కార్యదర్శులతో సిబ్బంది పోన్‌కాల్స్ ద్వారా మానిటరింగ్ చేస్తున్న విధానాలను కమిషనర్ పరిశీలించారు. కంట్రోల్ సెంటర్‌లో సిసిటీవిల ద్వారా జరుగుతున్న మానటరింగ్, పారిశుధ్య నిర్వహణ పనులు అన్న కార్యంటిన్‌ల నిర్వహణ తీరును కమిషనర్ పరిశీలించి సిబ్బందికి వివిధ సూచనలు జారీ చేశారు.

## జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను కలిసిన శాసన మండలి సభ్యుడు బీద రవిచంద్ర



**నెల్లూరు, జూలై 3, ప్రభాతవార్త – వైద్యం** జనసేన పార్టీ నిర్మాణ సారథుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నెల్లూరుకు విచ్చేసిన జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ఇంచార్జ్, నర్సాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, మత్స్యకార కమిటీ చైర్మన్ బొమ్మిడి నాయకర్‌ను శాసనమండలి సభ్యుడు, నెల్లూరు జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్ నందు మర్యాదపూర్వకంగా కలిసారు.

# నెల్లూరు గడప ముందుకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి - నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం





**నెల్లూరు, జూలై 3, ప్రభాతవార్త – వైద్యం** స్థానిక యువతకు నెల్లూరులోనే ఐటీ భవిష్యత్తు నెల్లూరు వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లో (టూటైర్ సిటీస్) యువత ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా, వారి గడప ముందుకే సాఫ్ట్‌వేర్ అవకాశాలను తీసుకురావడం అభినందనీయమని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన నగరపు మొట్టమొదటి మల్టీకంపెనీ ఏఐ ఇన్నోవేషన్ పార్క్ నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ** ఇలాంటి ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటు చదువుకుంటున్న విద్యార్థులకు, కళాశాల విద్య పూర్తి చేసుకున్న యువతకు ఎంతో మోటివేషన్ ఇస్తుందన్నారు. ప్రస్తుతం ప్రపంచం చాలా వేగంగా మారుతోందని, ఆ వేగాన్ని అందుకోవడం టూటైర్ నగరాల్లో కొంచెం సవాలుతో కూడుకున్నదైనప్పటికీ, రెనిల్ రెడ్డి కోమిట్ల లాంటి వ్యక్తులు ముందుకు రావడం నెల్లూరు జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా రెనిల్ రెడ్డి నేపథ్యాన్ని ఎంపీ గుర్తు చేసుకున్నారు. ఒకప్పుడు నెల్లూరు ట్రంక్ రోడ్డులో రేణిల్ తాత ఒక చిన్న సైకిల్ షాప్ నిర్వహించ వారని, అలాంటి సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన రేణిల్, విదేశాలకు వెళ్లి ప్రపంచ స్థాయి కంపెనీలను స్థాపించారని చెప్పారు. ఆ తర్వాత పుట్టిన ఊరికి ఏదైనా చేయాలని నెల్లూరుకు తిరిగి వచ్చి, 2022లోనే టెర్రాలాజిక్ కంపెనీ ప్రారంభించారని పేర్కొన్నారు. ఆయన ప్రయాణం నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. సీఎం చంద్రబాబు నాయుడి పిలుపునకు నిదర్శనం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడూ యువతకు సొంత ప్రాంతాల్లోనే పరిశ్రమలు నెలకొల్పి, ఇతరులకు ఉపాధి కల్పించాలని చెబుతుంటారని, నేడు రెనిల్ రెడ్డి అదే బాటలో నెక్సస్ ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశారని ఎంపీ అన్నారు. ప్రస్తుతం ఈ హబ్ ద్వారా 150 మందికి ఉపాధి లభించిందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 5,000 కు పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడని స్థానిక యువతకు ఈ కేంద్రం ఒక సువర్ణావకాశం అన్నారు. విద్యార్థులు తమ సొంత ఆలోచనలను స్టార్టప్‌లుగా మార్చుకోవడానికి ముందుకు రావాలని, నెల్లూరు ఎంపీగా ఈ ఇన్నోవేషన్ హబ్‌లకు, యువతకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

**ఐటీ రంగంలోనూ నెల్లూరు ముందడుగు**

నగరానికి సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావడం శుభపరిణామం సీఎం పిలుపు మేరకు ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్త ఎదగాలి నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నెల్లూరులో మొట్టమొదటి మల్టీకంపెనీ AI ఇన్నోవేషన్ పార్క్ నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ (Nexus Innovation Hub) ప్రారంభోత్సవంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ** వ్యవసాయం, ఆక్వాకల్చర్, పారిశ్రామిక రంగాల్లో ఇప్పటికే అభివృద్ధి చెందుతున్న నెల్లూరు జిల్లా ఇప్పుడు ఐటీ రంగంలోనూ ముందంజ వేయడం ఆనందదాయకమని అన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలను నెల్లూరుకు తీసుకొచ్చి నెక్సస్ ఇన్నోవేషన్ హబ్‌ని ప్రారంభించిన రెనిల్ రెడ్డి కి అభినందనలు తెలిపారు. ఈ హబ్ ద్వారా ఏర్పడుతున్న సంస్థలు రానున్న రోజుల్లో జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి బం భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు.

◆ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలనే లక్ష్యంతో యువతను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో యువత ఇలాంటి ఇన్నోవేషన్ హబ్‌లను సద్వినియోగం చేసుకుని తమ వినూత్న ఆలోచనలను స్టార్టప్‌లుగా మలచాలని సూచించారు. నెల్లూరులో ఐటీ, ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు అనుకూల వాతావరణం ఏర్పడడం ద్వారా స్థానిక యువతకు సొంత జిల్లాలోనే ఉన్నత స్థాయి అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్ , నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ వ్యవస్థాపకులు రెనిల్ రెడ్డి కోమిట్లతో పాటు పలువురు ప్రముఖులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.




# సర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతూన్నాయి

- కోవూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలో అనేక అవరోధాలు, ఇబ్బందులు
- విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌కి వినతి
- వైసీపీ మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి



**నెల్లూరు, జులై 3, ప్రభాతవార్త – కలెక్టరేట్** ఎస్ఐఆర్ ప్రక్రియలో కోవూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలో అనేక అవరోధాలు, ఇబ్బందులు ఉన్నాయి, వీటి పై విచారణ చేయాలని వైసీపీ మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కి వినతి అందచేసారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో సర్ ప్రక్రియ మొదలు పెట్టినప్పటి నుండి అనేక అవరోధాలు ఇబ్బందులు గుర్తించామని కొన్ని చోట్ల ఇన్యూమరేషన్ ఫాంలు బిఎల్ఎలకు సమాచారం లేకుండా బిఎల్ఓ ఇచ్చేశారని కొన్ని చోట్ల డేటా చోరీ జరిగిందని, కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో సర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, ఇటీవల మంత్రి నారాయణ నెల్లూరు నగర కమిషనర్ సర్ ప్రక్రియ గురించి మాట్లాడుకున్న విషయం గురించి జగన్ స్వయంగా మాట్లాడారని బిఎల్ఓలను ప్రలోభాలకు గురి చేస్తున్నారని సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు, సలహాలు ఇస్తున్నారని ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరగాల్సిన సర్ ప్రక్రియలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని, సర్ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా జరగడం లేదని కోవూరు నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫాంలు ఇచ్చారు కానీ వాటిని డిజిటల్ చేయలేదని డిజిటల్ పూర్తయితేనే అర్హులకు ఓట్లు వస్తాయని ఈ విషయం పై ఎన్నికల చీఫ్ అధికారికి కూడా పార్టీ తరపున లేఖ సమర్పించినట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

# బిఎల్‌వోలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

- విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూలై 3, ప్రభాతవార్త – కలెక్టరేట్** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో పాల్గొంటున్న బూత్ లెవెల్ ఆఫీసర్లు అందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరించారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు వెంగళరావు నగర్ ప్రాంతంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్ నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బిఎల్‌ఓలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇంటింటి సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా పనిచేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సమాచారం కోసం ఫోన్ చేసిన ఓటర్లందరకు సమాచారం అందించాలని బిఎల్‌వోలకు సూచించారు. ఓటర్ల నుండి అందుతున్న దరఖాస్తులను సకాలంలో పరిశీలించి, నిర్దేశిత విధానాల ప్రకారం నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ అనూష, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం




**నెల్లూరు కార్పోరేషన్, జులై 3 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని శానిటరీ కార్మికుల కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశపు మందిరంలో సామర్థ్య వృద్ధి,నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని స్వచ్ఛ ఆంధ్రా కార్పోరేషన్ నాలెడ్జ్ పార్టనర్ అయిన ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంటు ఆధ్వర్యంలో శుక్రవారం విజయవం తంగా నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ నాలెడ్జ్ పార్టనర్‌గా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్‌స ఎల్ఫ్ గవర్నమంట్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ సన్నారెడ్డి, కల్పనారెడ్డి నగర్ మేయర్ దేవరకొండ సుజాత అశోక్, నగర కమిషనర్ వైఓ.నందన్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఓ.దినేష్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ జిజియాలు పాల్గొన్నారు. శానిటరీ కార్మికులకు పట్టణ శుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యర్తాలు వేరు చేయడం వ్యక్తిగత రక్షణ పరికరాలు వినియోగం, ఆరోగ్య భద్రతా ప్రమాణాలపై సమగ్ర అవగాహన కల్పించారు. శానిటేషన్ రంగంలో మెరుగైన సేవలు అందించడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై శిక్షణలో ప్రధానంగా దృష్టి సారించారు. హాజరైన ముఖ్య అతిధులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు నగర పరిశుభ్రతలో కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారు తమ బాధ్యతలు నిర్వహించేందుకు శిక్షణలు ఎంతో అవసరం అన్నారు. పాల్గొన్న శానిటరీ కార్మికులు శిఓణ ద్వారా కొత్త విషయాలు నేర్చుకుని, తమ పనిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమం నెల్లూరు నగరంలో శుభ్రత ప్రమాణాలను మెరుగపరచడలో ముఖ్యమైన కార్యక్రమం అని తెలిపారు. ఈశిక్షణా కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ శానిటరీ కార్మికులు, మేస్త్రీలు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**నెల్లూరు, జూలై 3, ప్రభాతవార్త – వైద్యం** ఆర్థికంగా వెనుకబడిన, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) భరోసాగా నిలుస్తోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీ నెల్లూరులోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 5 మంది లబ్ధిదారులకు రూ.7.57 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం వారి వైద్య, అత్యవసర అవసరాలకు ఎంతో ఉపయోగపడుతోం దని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తన కార్యాలయం ద్వారా మొత్తం 144 మంది లబ్ధిదారులకు రూ.1.91 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేదలు, అవసరమైన సమయంలో ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడకుండా వారికి ప్రభుత్వం అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులు అందరికీ చేరేలా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## నాటుసారా, బెల్ట్‌షాప్‌లపై ఉక్కుపాదం

- డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ




**నెల్లూరు క్రైమ్, జూలై 3, ప్రభాతవార్త:** అక్రమ మద్యం, నాటుసారా, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. శుక్రవారం నెల్లూరు డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఆయన జిల్లా పరిధిలోని 11 ఎక్సైజ్ స్టేషన్ల కేసులను సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రాకుండా పటిష్ఠ తనిఖీలు చేయాలని సూచించారు. నేరాల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నాటు సారా తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెల్టు దుకాణాలు, బహిరంగ మద్యపానాన్ని కఠినంగా అరికట్టాలన్నారు. మద్యం దుకాణాల లైసెన్స్ గడువు 3 నెలలు మాత్రమే ఉండటంతో ఫీజుల వసూలు, అనధికార నిల్వలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పెండింగ్ దర్యాప్తు కేసుల్లో త్వరితగతిన చార్జ్‌షీట్లు దాఖలు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని నిలువరించాలని, ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యం క్రయవిక్రయాలు జరిగేలా చూడాలని, ఇతర రాష్ట్రాల్లో అరెస్టు కావాల్సిన వారిని వెంటనే అరెస్టు చేసి చార్జ్‌షీట్లు వేయాలని, ఎన్‌డీపీఎస్, గంజాయి కేసుల ముద్దాయిలను తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎం. శంకరయ్య, సహాయ కమిషనర్ పి. దయాసాగర్‌తో పాటు జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించిన.. ఎంఈఓ



**ఉదయగిరి, జులై 3, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి నార్త్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి తరగతి గదిలో ఉపాధ్యాయుడు విద్యార్థులకుబోధిస్తున్నప్పుడు అతని బోధనా తీరు సడలి ఏ విధంగా ఉందని పరిశీలించారు. ఉపాధ్యాయుడు సరిగ్గా బోధిస్తున్నాడా లేదా అని పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనానంతరం ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి అభినందించారు. మీ బోధన తీరు చాలా బాగుందని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభరీతిలో బోధిస్తున్నారని ప్రశంసించారు. తదుపరి అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు రెడీనేస్ ప్రోగ్రాం ఏ రోజు కా రోజు ఆప్డేటేడ్‌గా ఉండే విధంగా చూడాలని తెలియజేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ హాకీం గౌస్ భాషా, ఉపాధ్యాయులు సలీం జబీనా పాల్గొన్నారు.

## డీటీ వెంకటలక్ష్మికి తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు



**నెల్లూరు అగ్రికల్చర్, జూలై 3, ప్రభాతవార్త** నెల్లూరు అర్బన్ డిప్యూటీ తాసిల్దార్‌గా పనిచేస్తున్న డి. వెంకటలక్ష్మిని పూర్తి అదనపు తహశీల్దార్‌గా నియమిస్తూ గురువారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు తహసీల్దారుగా కొనసాగిన షఫీ మాలిక్ జూన్ 30న పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. నెల్లూరు అర్బన్ రెగ్యులర్ తహసిల్దార్‌ను నియమించే వరకు వెంకటలక్ష్మి ఇంచార్జి తహసిల్దార్‌గా కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో ఆమె శుక్రవారం పూర్తి అదనపు తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సత్వర సేవలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేని పరిపాలన సాగిస్తామని చెప్పారు. జవాబుదారీతనంతో వ్యవహరిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం తమ పరిధిలో ఎదురయ్యే పలు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా క్యాస్ట్, ఇన్కమ్, బర్త్ సర్టిఫికెట్లు, డెత్ సర్టిఫికెట్ల జారీ సజావుగా జరిగేలా చూస్తామని చెప్పారు. పారదర్శక పాలన తమ లక్ష్యమని వివరించారు.

## పనులు లేకుండానే బిల్లులు

ప్రహరీ నిధులపై విచారణ

**వింజమూరు, జూలై 3, ప్రభాతవార్త** వింజమూరు మండలంలోని శంఖవరం, నల్లగొండ పాఠశాలల్లో ఇటీవల చెల్లించిన ప్రహరీ పనుల బిల్లుల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. పనులు చేయకుండానే ప్రహరీలు కట్టినట్లు బిల్లులు చెల్లించారని వచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం సర్వ శిక్ష అభియాన్ విజయవాడ నాణ్యత నియంత్రణ అధికారి పాఠశాలలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ప్రహరీ నిర్మాణ స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బిల్లులు చెల్లించిన సమయంలో ప్రహరీ పనులు జరగలేదని రాతపూర్వకంగా వాంగ్మూలం ఇచ్చారు. పనులు జరగకుండానే బిల్లులు ఎలా చెల్లించారనే అంశంపై విచారణ చేశారు.ఈ సందర్భంగా నెల్లూరు సర్వ శిక్ష అభియాన్ జిల్లా పథక సంచాలకుడు మహేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకుడు ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. పనులు జరగకుండానే బిల్లులు చేసినట్లు ప్రాథమికంగా తేలిందని, పూర్తి వివరాలతో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఈ తనిఖీల కార్యక్రమంలో సహాయ ఇంజనీరు కృష్ణారెడ్డి సర్వ శిక్ష అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

# చాముండేశ్వరి దేవి హుండీ లెక్కింపు



**ఇందుకూరుపేట, జూలై 3, ప్రభాతవార్త :** మండలంలోని గంగపట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా 12 రోజులుగాను అమ్మవారి హుండి ద్వారా 244038 రూపాయిలు, అన్నదానము హుండీ ద్వారా 21087 రూపాయలు, టిక్కెట్ల ద్వారా 53040 రూపాయలు, అమ్మవారి కళ్యాణం రోజు చదివింపుల ద్వారా 51054 రూపాయిలు భక్తులు కానుకలుగా సమర్పించారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహణాధికారి తాత శ్రీనివాసరావు, దేవస్థాన చైర్మన్ గుండాల కృష్ణా రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. గుండాల మాధవరెడ్డి, కేతిరెడ్డి అవినాష్ రెడ్డి, మారుబోయిన జనార్ధన్ గౌడ్, సిబ్బంది శరత్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా కార్యాలయం గేటు మూత



**నెల్లూరు, జూలై 3, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయం నెల్లూరులో శుక్రవారం బోసిపోయి కనిపించింది. ఎప్పుడూ కార్యకర్తలు, నాయకులు, ప్రజల హడావుడితో సందడిగా కనిపించే పార్టీ కార్యాలయం శుక్రవారం ఉదయం 11:30 గంటల సమయంలో వార్త ప్రతినిధి అటుగా వెళుతూ గమనించగా, కార్యాలయ ప్రధాన గేటు మూసివేసి ఉంది. జనసంచారమే లేకపోవడంతో పార్టీ నాయకులను ప్రశ్నించగా వాచ్ మెన్ సెలవు పై వెళ్లడంతో కార్యాలయం మూసి ఉందని సమాధానమిచ్చారు.జిల్లా నాయకత్వం ఎవరూ ప్రజలకు అందుబాటులో లేకపోవడం సోచనీయం.

# బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**నెల్లూరు, జూలై 3, ప్రభాతవార్త :** ఐసిడిఎస్ పిడి బి. హేనా సుజన్ ఆదేశాల మేరకు బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళలు, పిల్లల్లో ఆత్మహత్యలు నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. బుజ బుజ నెల్లూరులోని డివియస్‌యమ్ మెమోరియల్ జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థుల కొరకు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు మహిళల భద్రత, బాలల హక్కులు, లైంగిక వేధింపుల నివారణ, సైబర్ భద్రత, మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ అవసరమైన సమయంలో సహాయం పొందాలని సూచించారు. అదే విధంగా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే మహిళా హెల్ప్‌లైన్ – 181, 112, చైల్డ్ హెల్ప్‌లైన్ – 1098, 14416 మానసిక ఆరోగ్య సహాయక నంబర్ల గురించి వివరించారు. అలాగే మానసిక సమస్యలు, కుటుంబ సమస్యలు లేదా వ్యక్తిగత ఇబ్బందులు ఎదురైనప్పుడు కౌన్సిలింగ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంకు సఖి వన్ స్టాప్ సెంటర్ నుండి కేస్ వర్కర్స్ జి. సాధన, పి.శారదా, ఐసీపీఎస్ సిబ్బంది పి. మంజుల యల్‌సిపిఓ పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు సఖి వన్ స్టాప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలు, చట్టపరమైన సహాయం, వైద్య సహాయం, మానసిక కౌన్సిలింగ్, అత్యవసర రక్షణ సేవల గురించి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఆసక్తిగా సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిఎన్‌యమ్ మెమోరియల్ జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ హెడ్ మాస్టర్ వివి రమణ స్కూలు ఉపాధ్యాయులు ఎం.పీ సౌజన్య, జి.హజరత్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి నారాయణ సేవా సంకల్పం



**నెల్లూరు, జూలై 3, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు నగరంలో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సేవా సంకల్పంతో నిరుపేద, మధ్య తరగతి ప్రజల కోసం నారాయణ నేత్ర జ్యోతి, నారాయణ దంత సురక్ష ఉచిత మెగా హెల్త్ క్యాంప్ 9వ డివిజన్ బంగ్లాతోటలో జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ ఆధ్వర్యంలో అప్రతిహతంగా జరిగింది. ఈ సందర్భంగా కువ్వారపు బాలాజీ మాట్లాడుతూ కోట్ల రూపాయల భారీ వ్యయంతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని నిరుపేదల ముంగిటకే తెచ్చేందుకు 3 కోట్ల రూపాయలతో అత్యాధునిక నారాయణ ఆన్ వీల్స్ మొబైల్ క్లినిక్ వాహనాన్ని మంత్రి ఏర్పాటు చేశారని, ఈ సేవా యజ్ఞంలో భాగంగా ఇప్పటివరకు నెల్లూరు నగరంలో 9,300 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, 5,000 మందికి పైగా ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశామని వెల్లడించారు. అంతేకాకుండా తీవ్రమైన దృష్టి లోపాలతో బాధపడుతున్న 150 మందికి పైగా రోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి కంటిచూపును పునరుద్ధరించడం జరిగిందని, వైద్యుల ప్రత్యేక శ్రద్ధ కోసం ప్రతి క్యాంప్‌లో 60 మందికి మించకుండా నిశితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మంచి చేయాలనే తపన ఉన్న నాయకుడు ఎమ్మెల్యేగా ఉంటే నగరం ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంత్రి నారాయణ చొరవే నిదర్శనమని కొనియాడుతూ డివిజన్ ప్రజల తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సుధా ,రఫీ,9వ డివిజన్ అధ్యక్షులు పాకాల పెంచలయ్య, యూనిట్ ఇంచార్జ్ కొండ్రగుంట సురేష్, వెంగయ్య ఆటో యూనియన్ ప్రెసిడెంట్, చంద్రమౌళి బిఎల్ఎ, కమల్, కో యూనిట్ ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నెల్లూరు, జూలై 3, ప్రభాతవార్త – వైద్యం :** 11 కేవీ తడికలబజార్ ఫీడర్, 33/11కేవీ రేబాల వీధి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ అంతరాయం శనివారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా క్రింది ప్రాంతాలలో నిలిపివేయబడుతుందని ఏఈ ఎం. శ్రీధర్ తెలిపారు. తడికల బజార్, ముకుందపురం, విజయగోపాలపురం ఇండస్ట్రీస్ ఏరియా, ఆర్ఎస్ఆర్ స్కూల్ చుట్టు ప్రక్కల, నజీర్ తోట, ఎఫ్‌సిఐ కాలనీ, కృష్ణా నగర్, పప్పుల వీధి, రేబాల వీధి, ఉస్మానసాహెబ్ పేట, రాంనగర్, సిఆర్‌పి డొంక, మసీద్ సెంటర్ వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేశారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**మర్రిపాడు, జూలై3, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో స్వర్ణాంధ్ర మరియు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని మండల పరిషత్ అధికారి నాగేశ్వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతినెల 3వ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లో భాగంగా ప్రణాళికపై ప్రజలకు అవగాహన కల్పించాలని , ప్రతి నెల 3వ శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈకార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. 18వ తేదీ శనివారం సందర్భంగా వాటర్ పాసిటివ్ ఆంధ్ర కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు నిర్వహించాలని, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పరిధిలో మండల పరిషత్ ప్రాదేశికంగా నియోజకవర్గ సభ్యులు, ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తమ నరగామ పంచాయతీలో జరుగుతున్న స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు నోట్‌కామ్ తీసి వాట్సప్ గ్రూపులో పంపాలని ప్రతి కార్యదర్శిని ఆదేశించారు.

# మెగా లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలి



**కావలి, జూలై 3 ప్రభాతవార్త :** కావలి న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆధ్వర్యంలో ఈనెల 11న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని కక్షదారులను శుక్రవారం లోక్ అదాలత్ సబ్యులు ఎం.మాలకొండరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుకు రాని కేసులు పెండింగ్ కేసులు ఖర్చు కాలయాపన లేని అప్పీల్‌లేని అంతిమ తీర్పులను లోక్ అదాలత్‌లో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కక్షదారులకు లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ జాతీయ లోక్ అధాలత్‌లో కొండాపురం, జలదంకి, కలిగిరి, కావలి, బోగోలు మండలాల కక్షిదారులు సత్వర న్యాయం పొందాలని తెలిపారు.

# పంచాయతీలో ఆక్రమణలకు అడ్డుకట్ట వేయండి



**బిట్రగుంట జూలై 3 ప్రభాతవార్త** బోగోలు మేజర్ పంచాయతీలో అధికారులు నిద్రవస్థలో ఉండడంతో రోజురోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. దీనివల్ల రహదారులు కుదించకపోయి రాకపోకలకు అంతరాయం జరుగుతుంది. అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. ఇకనైనా జనం సమృద్ధిగా తిరిగే ప్రాంతాల్లో వీటికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తెలియని రుణం.. నిలిచిన శ్రీనిధి రుణం

– :గ్రామసభలో తహాశీల్దార్‌కు మహిళ వినతి




**విడవలూరు, జూలై 3 ప్రభాతవార్త:** తనకు తెలియకుండా పీఓపీ రుణాన్ని తన పేరుపై నమోదు చేయడంతో ప్రస్తుతం శ్రీనిధి రుణం మంజూరు కావడం లేదని ఆరోపిస్తూ మండలంలోని విడవలూరు గ్రామ హరిజనవాడకు చెందిన పోసిన దీప శుక్రవారం గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. తాను 2023 నుంచి సంఘబంధం-4లోని బ్లెస్సి ఎస్‌హెచ్‌జీ సంఘం లో లీడర్‌గా కొనసాగుతూ క్రమం తప్పకుండా పొదుపు చెల్లిస్తూ బ్యాంకు రుణాలు పొందుతున్నట్లు తెలిపారు. ఇటీవల శ్రీనిధి రుణం కోసం సంఘమిత్ర కార్యాలయాన్ని ఆశ్రయించగా, 2016లో సంఘబంధం-1లోని గంగ గ్రూపు పేరుతో తనపై రూ.35 వేల పీఓపీ రుణ బకాయి ఉన్నట్లు తెలిపి రుణం మంజూరు చేయలేదన్నారు. అయితే ఆ గ్రూపు 2017లోనే నిలిచిపోయిందని, తన పేరుపై పీఓపీ రుణం మంజూరైన విషయం కూడా తనకు తెలియదని పేర్కొన్నారు. అప్పటి సంఘం వీఓఏ తనకు తెలియకుండా ఆ రుణ నగదును వినియోగించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని సంఘమిత్ర కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత వీఓఏతో కలిసి తనతో దురుసుగా ప్రవర్తించి కార్యాలయం నుంచి బయటకు పంపించారని వాపోయారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని తహాశీల్దార్‌ను కోరారు.

# గ్రామసభకు అన్ని శాఖల అధికారులను హాజరుపర్చాలి

# తహశీల్దార్‌కు సొసైటీ చైర్మన్ పురంధర్‌రెడ్డి వినతి



**విడవలూరు, జూలై 3 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో నిర్వహించిన వన్ మంత్-వన్ విలేజ్-ఫోర్ విజిట్స్ కార్యక్రమానికి రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు మినహా ఇతర శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై సొసైటీ చైర్మన్ పొన్నలూరు పురంధర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్నకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధిత అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. తొలి విడత గ్రామసభలో పలువురు అధికారులు గైర్హాజరు కావడంతో ప్రజలు తమ సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కోల్పోయారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి మరోసారి పునరావృతం కాకుండా రెండో విడత గ్రామసభకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న, సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించి, రెండో విడత గ్రామసభకు వారందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# శాస్త్రీయ పద్దతిలో సాగు చేపట్టి అధిక దిగుబడి సాధించాలి





**కోవూరు, జూలై 3 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ పద్ధతిలో సాగు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. కోవూరులోని వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం ఖరీఫ్, వరి వేరుశెనగ సాగుపై ఆదర్శ రైతులకు ఆత్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సాగు పద్దతులను రైతులు అనుసరించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు, పురుగుమందులు వాడుకోవడం, సమగ్ర నివారణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు , మెరుగైన ఆదాయం పొందవచ్చన్నారు. ఆత్మ పీడీ ఉషారాణి మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన మెళుకువలు, శిక్షణా శిబిరాలు ఇచ్చేందుకు ఆత్మ ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తుందన్నారు. శాస్త్రవేత్తలు వినీత, మధుసూదన్‌లు మాట్లాడుతూ రైతులు విత్తన ఎంపిక నుంచి నూర్పు అయ్యే వరకు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు, పురుగుమందులు వాడుకోవడం, నీటి యాజ మాన్య పద్దతులు పాటిస్తే సాగు ఖర్చును ఘననీయంగా తగ్గించవచ్చన్నారు. సహాయ వ్యవసాయ సంచాల కులు అనిత ఆదర్శ రైతులకు పలు విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం రైతు లకు లాభసాటి వరి సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో వివిధ రకాల వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారులు రజని, విజయలక్ష్మి, లక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

# సాయి అపర్ణను ఆదర్శంగా తీసుకోవాలి



**కోవూరు, జూలై 3 ప్రభాతవార్త :** ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన సాయి అపర్ణను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈవో-2 చెంచులక్ష్మమ్మ తెలిపారు. కోవూరు మండలం గుమ్మలదిబ్బ ఉన్నత పాతశాలలో యూటీఎఫ్ జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహించిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ గుమ్మలదిబ్బ ఉన్నత పాతశాలకు జిల్లాస్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో పేరు తెచ్చేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేశారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సృజనా ప్రసాద్ చేతుల మీదుగా అందించారు. జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన అపర్ణకు రూ. 10వేలు, ఈ పాతశాలలో రెండవ స్థానం సాధించిన శివకృష్ణకు రూ. 7500, భార్గవ్‌కు రూ. 5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయుడు సృజనా ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాతశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఉన్నారు.

# వైభవంగా సంకటహర చతుర్థి

**కోవూరు, జూలై 3 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ దక్షిణా ముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న శ్రీ విఘ్నే శ్వరునికి శుక్రవారం సంకటహర చతుర్థి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నాగరా జాచా ర్యులు చేతుల మీదుగా సాంప్రదా యబద్ధంగా అభిషేక పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఈ పూజలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు 5 గంటల పాటు విద్యుత్ కోత



**కోవూరు, జూలై 3 ప్రభాతవార్త :** కోవూరులోని ఎన్‌టీఎస్‌లో ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోవూరు మండల పరిధిలోని వ్యవసాయ వినియోగదారులకు ఉదయం 6 నుంచి 8 వరకు మధ్యాహ్నం 1 నుంచి 6 వరకు విద్యుత్ సరఫరా ఇవ్వడం జరుగుతుందన్నారు. కోవూరు, పడుగుపాడు పట్టణాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా విద్యుత్ సరఫరా అందజేయడం జరుగుతుందని, ఇందుకు విద్యుత్ వినియోగదారులు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు.

# ఘనంగా ఏకాంత సేవ ముగిసిన బ్రహ్మోత్సవాలు



**కోవూరు, జూలై 3 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంట ర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్ష సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారికి ఏకాంత సేవ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బ రామయ్య స్వామి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఉభయ కర్తలుగా నల్లపనేని పెంచలయ్య, సరోజ నమ్మ కుమారుడు నల్లపనేని చౌదరి, సుజాత దంపతులు వ్యవహరించారు. ఆలయకార్య నిర్వాహణ అధి కారి చేవూరు కృష్ణప్రసాద్, రుత్వికులు సుబ్బయ్య స్వామి, వంశీ స్వామి,నంద కిషోర్ స్వా మి, సుబ్బ య్య స్వామి, వంశీ స్వామి,నందకిషోర్ స్వామి, నాగరాజు స్వామి, భక్తులు ఉన్నారు.



# జడ శ్రావన్‌కుమార్‌పై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలి

# జై భీమ్‌రావు భారత్‌పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మైనంపాటి



**కావలి, జూలై 3 ప్రభాతవార్త :** జై భీమ్ రావు భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్‌కుమార్‌పై వారికి సహకరించిన వారిపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు తొలగించాలని జై బీమ్‌రావు భారత్‌పార్టీ జిల్లా అధ్యఓఉలు డాక్టర్ మైనంపాటి యేసురత్నం డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం కావలి ట్రంక్‌రోడ్డులో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో దళిత క్రైస్తవ సమర శంఖారావం కార్యక్రమంలో ప్రశ్నా టీవి రావణ్ ప్రసంగించిన ప్రసంగంలోని మాటాను తప్పుబట్టి వారిపై పెట్టిన కేసులను జడ శ్రావన్‌కుమార్ మాట్లాడిన మాటలకు ప్రశ్నించే వారి మీద మా వైఖరి ఇంతే అని తెలిజేస్తున్న కూటమి ప్రభుత్వానికి నిరసన తెలియేయడం జరిగిందన్నారు. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలు అడిగే వారిపై కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక మత విద్వేషాలను రెచ్చగొడుతూ అడిగిన వారిపై అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యంలో ఏ మాత్రం సరైనది కాదన్నారు. ఈ విషయంపై మేధావులు, నిఘావర్గాలు ఏపి రాష్ట్ర పరిరక్షులు ఆలోచించాలని జైబీమ్‌రావు పార్టీ తెలిపింది. రఘురామరాజుకు గుడి కడితే పూజించే భక్తుల పూజించే వారు ఉండాలని కాదా మేమందరం క్రైస్తవులుగా మారి ఉన్నాము ఇక్కడ చర్చి కట్టుకన్నాము 500ఇండ్లు ఆలాడలో ఉంటే అందరం చర్చిలకు వెలుతున్నామన్నారు. కొందరు హిందూసోదరులు దేవాలయం అడుగుతున్న దగ్గర కట్టండి అని అక్కడ ప్రజలు చెప్పినా కూడా ఇక్కడే కడతాము ఏం చేస్తారు అని వాగ్వాదానికి దిగి మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈకార్యక్రమంలో జైబీమ్‌రావు భారత పార్టీ కార్యకర్తలు వి.ఫణీంద్ర, ఏ మాల్యాద్రి, విజయ్, సుధా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు కొత్తవారికి వెంటనే ఇవ్వాలి



**కావలి, జూలై 3 ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షనుల కొత్తవారికి వెంటనే మంజూరు చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. శుక్రవారం కావలిలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహశీల్దార్ శ్రావన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పించన్‌లు ఇప్పటి వరకు మంజూరు కాలేదని తెలిఆపరు. పించన్‌లు మంజూరు చేసి చాలా ఏళ్లు అవుతుందని తెలిపారు. జిల్లాలో వివిధ రకాల పించన్లు ఉన్నాయన్నారు. కొన్నేళ్లలో వేలాది మంది మృతి చెందారని వారి స్థానంలో నూతన పించన్లు మంజూరు చేయాలని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపి వంటి వాటికి ప్రభుత్వం మందులు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. రుద్రకోట అరుంధతి వాడలో సంఘవంద కార్యాలయానికి భూమిని కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, లక్ష్మీనర్సు, కోవూరు నరసింహారావు, తిరుపతి, కొండమ్మ, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జి రాంజీ పథకాన్ని రద్దు చేయాలి



**కావలి, జూలై 3 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జి రాంజీ పథకం రద్దు చేయాలని కోరుతూ ఎంపిడిఓ ముజపర్ రహీంకి వ్యవసాయ కార్మిక సంఘం కెవిపిఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మాల్యాద్రి మాట్లాడారు. నూతన ఉపాధి హామీ పథకంలో కన్నా పాత ఉపాధి హామీ చట్టంలో హక్కులు కలిగి ఉన్నాయని రోజు రోజుకు ఉపాధి పనిని నిర్వీర్యం చేసే జి రాంజీ చటాటన్ని తీసుకురావడం జరిగిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించుకొని రాష్ట్రానికి రూ.10వేల కోట్లను ఇవ్వాలని నూతన చట్టం రదు చేయాలని కోరారు. ప్రతి కూలికి రూ.600లు ఇచ్చి పనిదినాలు 200రోజులు కల్పించాలని తెలిపారు. కార్మికులు చనిపోతే వారికి రూ.10లక్షలు ఇస్తూ పాత చట్టాన్ని కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.రాధాక్రిష్ణయ్య, కమిటీ సభ్యులు నారాయణ, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.జాన్ మదు, శెట్టిపల్లి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాదవ్‌తో బిజెపి నాయకులు,కార్యకర్తలు



**దుత్తలూరు జూలై 3 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో శుక్రవారం రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాదవ్ బిజెపి కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. జమ్మల మడుగులో జరిగిన స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో చేరుకున్న ఆయనకు బిజెపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమంపై కార్యకర్తలకు సూచనలు అందజేశారు. ఈకార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు లెక్కల వెంగళరెడ్డి, ముడిమాల రమేష్‌రెడ్డి,మాదవ్, మేకపాటి మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గోన్నారు.

# వైభవంగా వసంతోత్సవం



**గూడూరు, జూలై 3, ప్రభాతవార్త :** గూడూరు పట్టణంలోని రాజావీధిలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీవారికి వసంతోత్సవం, చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన విశేష పూజల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంటి రామ్మోహన్ రావు, గమిడి వెంకట సుబ్బయ్య, విజయలక్ష్మి,సునీల్ క్రిష్ణ,సంధ్య,అనుమకొండ శ్రీనివాసులు, సురేఖ, చైతన్య, ఆకాంక్ష, జొన్నా మురళీ క్రిష్ణ, దేవి సుచరిత, జొన్నా బాలక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# వేదగిరి నిత్యాన్నదాన పథకానికి 50 వేల రూపాయల విరాళం



**నెల్లూరు, జూలై 3, ప్రభాతవార్త – అగ్రికల్చర్:** నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండపై వెలసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు దాతలు స్పందించి తమకు తోచిన విరాళాలను అందిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం స్పందన ఫౌండేషన్ చైర్మన్ నిడమానూరు నాగేశ్వరరావు తన సతీమణి ప్రదీప స్వామివారి నిత్యాన్నదాన పథకానికి 50 వేల రూపాయల విరాళాన్ని ఆలయ ఈవో వేమూరి గోపికి చెక్కు రూపేణా అందజేశారు. వారి కుమార్తె శ్రీ తులసి, కుమారుడు శ్రీకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత నిడమానూరు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కుటుంబం, దేవస్థానంలో జరుగుతున్న పూజలు అన్నప్రసాద వితరణ వంటి కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వేమూరి గోపి మాట్లాడుతూ వ్యాపార రీత్యా అమెరికాలో ఉంటూ భారతదేశంలో స్పందన ఫౌండేషన్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, అప్పలాచార్యులు స్పందన ఫౌండేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గుర్రం సురేంద్రబాబు, ఆది శంకర ఇంజనీరింగ్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ గుడ్లూరు రవిచంద్ర, డాక్టర్ వేమూరి యుగంధర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. దాతలకు స్వామివారి దర్శనం, తీర్థప్రసాదాలు అందజేసి శేష వస్త్రాలను బహుకరించారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి



**పొదలకూరు, జూలై 3, ప్రభాతవార్త :** పొదలకూరు మండలం ఇనుకుర్తి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. దేగపూడి గ్రామానికి చెందిన తాళ్లూరు రవీంద్ర (41) సొంత పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై పొదలకూరుకు వస్తుండగా, పొదలకూరు నుంచి రాపూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రవీంద్ర సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పొదలకూరు సీఐ వెంకట్రావు, ఎస్ఐ హనీఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ హనీఫ్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన ఎంపిడివో



**కోట,జులై 3 ప్రభాతవార్త :** కోట సచివాలయంలో శుక్రవారం సర్ ప్రక్రియను ఎంపిడివో ఆర్.దిలీప్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రికార్డులను పరిశీలించారు. సర్ ప్రకియనుపగడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. అర్హులందరికి ఓటు హాక్కు ఉండేలా చర్యలు చేపట్టలన్నారు. పత్రాలలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా బీఎల్‌వోలు ఓటర్లు కు అవగాహన కల్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షుణంగా పరిశీలించిన తర్వాతే అప్‌లోడ్ చేయాలన్నారు.

## ఎస్ఐఆర్ సర్వేను పరిశీలించిన ఆర్‌డిఒ బి.పావని



**అనుమసముద్రంపేట, జులై3,ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలంలోని అనుమసముద్రం గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియను శుక్రవారం ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని ఆకస్మికంగా పరిశీలించారు సర్వే నిర్వహణ, రికార్డుల నిర్వహణ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనితీరును పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగాఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని , ఎవర మినహాయింపుకు గురికాకఉండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని ఇతర గ్రామాలతో పోలిస్తే అనుమసముద్రంలోఎస్ఐఆర్ సర్వే పురోగతి వెనుకబడి ఉందని ఆర్‌డిఒ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇప్పటివరకు కేవలం 20శాతం మేర మాత్రమే సర్వే పూర్తికావడం పట్ల సంబంధిత బిఎల్‌ఒల పనితీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్ఐఆర్ సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించి వారి సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే పనులను నిర్లక్ష్యం చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని ఆర్‌డిఒ బి.పావని హెచ్చరించారు.

## మండల కేంద్రంలో తొలి విడత గ్రామసభ... 7 అర్జీల స్వీకరణ




**విడవలూరు, జులై 3 ప్రభాతవార్త:** మండల కేంద్రం గ్రామ సచివాలయంలో ఒకే నెల-ఒకే గ్రామం-నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా తొలి విడత గ్రామసభను తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామ ప్రజల సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై గ్రామస్థులతో చర్చించారు.గ్రామసభలో మొత్తం 7 అర్జీలు అందగా, వాటిలో భూ సమస్యలకు సంబంధించిన 5, ఇతర సమస్యలకు సంబంధించిన 2 అర్జీలను స్వీకరించారు. అందిన అర్జీలను సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాశం శ్రీహరి రెడ్డి, పుండ్ల అచ్యుత్ రెడ్డి, పొన్నలూరు పురంధర్ రెడ్డి,సత్తివోలు సత్యం రెడ్డి, తుళ్లూరు గోపాల్, మండల సర్వేయర్ శ్రీలత, ఆర్ఐ అబ్దుస్ సలాం, వీఆర్వో దుర్గాప్రసాద్, కార్యదర్శి జగదీష్, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బీఎల్‌వోకి వీఆర్వోలకు ఎస్ఐఆర్ 156 ఫారమ్స్ అందజేసిన వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు గురవయ్య



**ఉదయగిరి, జులై 3, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఉదయగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉన్ని మొదల గురవయ్య ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ఓటర్ ఫామ్‌ను అది సెలెక్ట్ చేసి బీఎల్ఓ పి.నాగరాజు వీఆర్వో మాలకొండయ్యలకు అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మీకి కొండాయపాలెం పంచాయతీకి సంబంధించిన 156 ఫారంలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం బీఎల్ఓ మన్నేటి బాలిరెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు కరెంటు ఓబుల్‌రెడ్డి, వైసీపీ విలేజ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, వైసీపీ విలేజ్ సెక్రటరీ సాంబశివారెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జమ్మువరం గ్రామంలో "వన్‌మంత్ - వనన్‌విలేజ్"



**అనుమసముద్రంపేట,జులై3,ప్రభాతవార్త:** మండలంలోని జమ్మువరం గ్రామంలో శుక్రవారం 'వన్‌మంత్-వన్‌విలేజ్' కార్యక్రమాన్ని ఎంపిడిఒ పి.ప్రసన్నకుమారి , ఇన్‌చార్జ్ తహ సిల్దార్ జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, రెవెన్యూ సంబంధిత అంశాలతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీ రును పరిశీలించారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధి అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషిచేయాలని, ఎంపిడిఒ పి.ప్రసన్నకుమారి, ఇన్‌చార్జ్ తహసిల్దార్ జి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మండల సర్వేయర్ అజిద్, వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## పీర్ల సావిడి ప్రమాదకర మలుపు పరిశీలన

**- స్థానికుల వినతిపై స్పందించిన ఎంపీడీవో త్వరలో మరమ్మతులకు హామీ**



**కొడవలూరు, జులై 3 ప్రభాతవార్త:** కొడవలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పీర్ల సావిడి వద్ద ఉన్న ప్రమాదకర మలుపును స్థానిక ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి వెంకట సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. ఈ మలుపు కారణంగా పాఠశాల బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రమాదకర ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన ఎంపీడీవో, ప్రజల భద్రత దృష్ట్యా త్వరలోనే మరమ్మతు పనులు చేపట్టి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి నసీమా,భార్గవ్, స్థానిక నాయకుడు బాచి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పనుల్లో వేగం పెంచండి

**- కావలి డిడిఓ విజయ్‌కుమార్**



**కొడవలూరు, జులై 3 ప్రభాతవార్త :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని కావలి డీడీఓ విజ య్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, నమోదు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో చోటు దక్కేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఎల్వోలు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.అనంతరం సచివాలయంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి సిబ్బంది హాజరు, పనితీరు, సమయపాలనను పరిశీలించారు. సంబంధిత రికార్డులను తనిఖీ చేసి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై బీఎల్వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం, నింపిన ఫారాలను సకాలంలో స్వీకరించడం, వివరాలను నిబంధనల మేరకు నమోదు చేయడం వంటి అంశాల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని సూచిం చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి విజయ్కుమార్, ఆర్ఐ, వీఆర్వోలు, బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



**కోవూరు, జులై 3 ప్రభాతవార్త :** డెంగ్యూ నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని రానున్న వర్షా కాలంలో డెంగ్యూ వ్యాధి పట్ల విద్యార్థులుపూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని సబ్ యూనిట్ అధికారి నాగరాజు అన్నారు. కోవూరు మండలం గుమ్మలదిబ్బ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం విద్యార్థులకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ప్రమాదకరమని, ఈ వ్యాధి ఎడిస్‌ఈజిప్ఫైస్ అనే వ్యాధి వలన వ్యాప్తి చెందుతుందన్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి సోకిన వారికి తీవ్రమైన జ్వరం రావడం, వాంతులు రావడం, భరించలేని తలనొప్పి , ఉంటే వెంటనే సకాలంలో చికిత్స చేయించుకోకపోతే ప్రాణాంతకంగా మారుతుందన్నారు. ఈ వ్యాధిని వ్యాప్తి చేసే దోమలు నల్లగా, తెల్లని మచ్చలు కలిగి ఉంటాయన్నారు. ఈ డెంగ్యూ నిర్ధారణకు సంబంధించి ఎలీషా టెస్ట్‌ను ల్యాబ్‌లో చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా చర్యలు తీసుకుంటే ఈ వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. అనంతరం ఈ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత డెంగ్యూ నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాధాకృష్ణ, ఏఎంఎం సలోమి, సునీత, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం



**అల్లూరు, జులై 3 ప్రభాతవార్త :** అల్లూరు మండల పరిధిలోని తూర్పు గోగులపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఒకటో తంగతి చిన్నారులకు అక్షరాబ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కా ర్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన కో మిట్ట పవన్‌కుమార్‌రెడ్డి చిన్నారులకు అక్ష రాల ఆశీస్సులు అందించి వారి విద్యా భ్యాసం విజయవంతంగా సాగాలని తెలిపారు. ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు, పూజారి సనత్‌కుమార్ సమక్షంలో ఒకటవ తరగతిలో చేరిన 15మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించి చిన్నారుల విద్యాభ్యాసం అక్షరంతో మొదలైన ఈప్రయాణం జ్ఞానంతో వెలిగే జీవితానికి నాంది కావాలని కోరుకుటూ చిన్నారులను ఆశీర్వ దించారు.

## సర్ కార్యక్రమాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోండి

**- 18 ఏళ్ళు నిండిన యువత ఓటర్లుగా నమోదు కండీ**

**- 14 వరకు ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియ : ఎంపీడీవో వి. శైలేంద్ర కుమార్**



**నెల్లూరు, జులై 3, ప్రభాతవార్త - అగ్రికల్చర్** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమం నెల్లూరు రూరల్ మండలంలోని 18 గ్రామ పంచాయితీలలో వేగవంతంగా నిర్వహిస్తున్నామని, ఓటర్లు సహకరించి ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్‌ఒలకు అందించాలని రూరల్ మండల ఎంపీడీవో వీ. శైలేంద్ర కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నెల్లూరులోని తన చాంబర్‌లో ప్రభాతవార్త ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. మే 15న ప్రారంభమైన సర్ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతుందన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఈ నెల 14 చివరి తేదీగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ లోపు ఓటర్లంతా ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్వోలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఫారం 6 ద్వారా ఓటరుగా నమోదు కావాలన్నారు. ఫోటో అంటించిన వెన్యూమరేషన్ ఫారాన్ని ఆధార్ జిరాక్స్ కాపీ తో జత చేసి అక్కడే ఓటర్ వివరాలను పోలింగ్ బూత్‌లలో బిఎల్‌ఒలకు తెలియజేయాలని సూచించారు. రూరల్ మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో సర్ కార్యక్రమం 100 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాలు కూడా ఉప్పుటూరు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని సర్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసేందుకు బిఎల్‌వోలు కృషి చేయాలని కోరారు. సజ్జాపురం కూడా 92 శాతం పూర్తయినట్టు తెలిపారు. సర్ కార్యక్రమాన్ని నిరం తరం పర్యవేక్షిస్తున్నామని గత వారంలో ములుమూడి, కొత్త వెల్లంటి, సజ్జాపురం, సౌత్ మోపూరు, దేవరపాలెం తదితర గ్రామాలను పరిశీలించామన్నారు. తాజాగా పెనుబర్తి, కాకుపల్లి, కలివెలపాలెం, మాదరాజు గూడూరు గ్రామాలను సందర్శించగా సర్ కార్యక్రమం 60 శాతం వరకు చేరుకుందన్నారు. 18 ఏళ్ల నిండిన యువత ఓటు హక్కు పొందేందుకు ముందుకు రావాలన్నారు.

**- రూరల్‌లో గ్రామ సభల ద్వారా సమస్యలను పరిష్కరిస్తాం..** పంచాయతీలలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలనలో తాగునీరు పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. త్వరలో ప్రత్యేక అధికారుల ద్వారా గ్రామసభలు నిర్వహించి తద్వారా సమస్యలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందన్నారు. వీరంతా పంచాయతీ కార్యదర్శులతో గ్రామాలను పరిశీలించి సమస్యలు తెలుసుకుని వీధి దీపాలు, తాగునీటి సమస్య, పారిశుధ్య సమస్యలు లేకుండా పనిచేయడం జరుగుతుందన్నారు.

## యస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తిచేయాలి



**కలిగిరి,జులై3, ప్రభాతవార్త;** కలిగిరి మండలంలో జరుగుతున్న యస్ఐఆర్(సర్) కార్యక్రమాన్ని ఎంతో పారదర్శకంగా ను,వేగ వంతంగా పూర్తి చేయాలని ఉదయగిరి నియోజకవర్గరిటర్నింగ్ అధికారి(ఆర్వో) కె. వెంకట రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలిగిరి మండలంలో పర్యటించిన అధికారి (యస్‌యస్ఆర్, యస్ఐఆర్)సర్ కార్యక్రమన్ని పరిశీలించారు.ఈసందర్బంగా అధికారులు బియల్‌ఓలు చేస్తున్న సర్ కార్యక్రమాన్ని స్వయం గా పరిశీలించారు. అనంతరం బిఎల్‌ఓలతో సమావేశమైన ఆర్వో సర్‌కార్యక్రమంపై కొన్ని మార్గ దర్శకాలను వివరించారు. అంతేగాక ఈకార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకరంగా చేపట్టినందున ప్రతిఒక్కరూ పనిలోపారదర్శకత చూపాలన్నారు. పని వేగం పెంచాలన్నారు.ఈ సందర్భంగా క్షేత్ర స్తాయిలో జరుగుతున్న గణన పత్రాల పంపిణీ,వాటి కంప్యూటీకరణ,అనంతరం ఆయన మాట్లాడుతూ పనిభారం పెరిగినట్లైతే అంగన్‌వాడా ఆశావర్కర్లను కూడా ఉపయోగించుకొని సకాలంలో పనిపూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల తాసిల్దారుగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ



**పొదలకూరు, జులై 3, ప్రభాతవార్త** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బి. చెర్లోపల్లిలో పాఠశాల పూర్వ విద్యార్థి పి. సుచరిత పాఠశాలలోని విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు వారి తల్లి పి. భారతి చేతుల మీదగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సుధాకర్ రావు పాల్గొన్నారు.

## వీధిలైట్లు వేయించాలని గ్రామస్తుల విన్నపం



**సీతారామపురం జులై 3 ప్రభాతవార్త** మండలంలోని బసినేని పల్లి హరిజనవాడ అందకారంలో ఉందనివీధి స్తంభాలకు లైట్లు వెలగకపోవడంతో గ్రామంలో చీకటి అలముకుంది. వీధిలైట్లు వేయాలని గ్రామస్తులు ఫిర్యాదు చేసినా ఫలితం లేక పోవడంతో గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.గ్రీవెన్స్ ద్వారా అర్జీలు ఇచ్చినా పంచాయితీలో నిదులు లేవని వీదిలైట్లు మరమ్మత్తులు చేయించలేమని తిరిగి లిఖిత పూర్వక సమాధానం చెబుతున్నారని పనులు మాత్రం చేయడం లేదని గ్రామస్తులు వాపోయారు. పంచాయితీలో సర్పంచ్‌ల పాలన ముగిసి ప్రత్యేకాధికారుల పరిపాలన వచ్చినప్పటికి అధికారులలోఎటువంటి చలనం లేదని గ్రామంలో చీకటి అలముకోవడంతో విష సర్పాలు, వస్తున్నాయని తద్వారా ప్రాణాలకు ముపుకలుగుతుందెమోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వీధిలైట్లు రిపేరే చేయించాలని వారు కోరారు.

## విద్యార్ధులకు విద్యాసామాగ్రి పంపిణి



**సీతారామపురం జులై 3 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామంలో ఉన్న మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నంగి ప్రసాద్ తన సొంత నిధులతో సుమారు 10 వేల రూపాయల విలువగల విద్యాసామాగ్రిని పాఠశాలలోని సుమారు 73 మందివిద్యార్ధిని విద్యార్ధులకు సమకూర్చారు. ఈవిద్యా సామాగ్రిని ఎంఇఒ షేక్ మస్తాన్ వలిసీతారామపుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు వి ప్రవీణ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒగూరు వాండ్లపల్లి ప్రదానోపాధ్యాయుడు ప్రభాకర్ చేతుల మీదుగా పిల్లందరికి పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పేరెంట్స్ కమీటి చైర్మన్ తదితరులు పాల్గోన్నారు

## స్వచ్ఛ గ్రామాలపై ప్రత్యేక దృష్టి



**ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయినది**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలం,పంగిలి గ్రామానికి చెందిన నల్లు శివ S/o శంకరయ్య కు సంబంధించిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ సర్టిఫికెట్లు జిరాక్స్ తీసుకొని రాపూరు బస్టాండులో బస్సు ఎక్కే సమయంలో పోయినవి. పదవ తరగతి హాల్ టికెట్ నెంబర్ 1217137232, పాసైన సంవత్సరం 2012 ఇంటర్మీడియట్ హాల్ టికెట్ నెంబర్ 1408228176, పాసైన సంవత్సరం 2014 ఎవరికైనా దొరికిన యెడల క్రింది సెల్ నెంబర్‌కు తెలియజేయగలరు.

**సెల్: 8374798206**

**కోవూరు, జులై 3 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీ డీవో కార్యాలయంలో శుక్రవారం ఆయన డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి స్వచ్ఛ గ్రామాలు, ఎస్ఐ ఆర్‌పై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన ఇంటి పన్నులు, కుళాయి పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరిం చాలన్నారు. అదేవిధంగా చెత్తాచెదారాలను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా మీ ఇంటికి వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు తడి చెత్త, పొడి చెత్త రూపంలో అందజేయాలన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు.

## విడవలూరులో ఎస్ఐఆర్ జోరు.. 99.08% శాతం ఫారాల పంపిణీ పూర్తి



**విడవలూరు, జులై 3 ప్రభాతవార్త:** మండలంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటల నాటికి మొత్తం 41,950 మంది ఓటర్లకు గాను 41,565 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడంతో 99.08 శాతం పంపిణీ పూర్తయినట్లు తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న తెలిపారు. అలాగే ఇప్పటివరకు 14,215 ఫారాలను డిజిటైజ్ చేయగా, ఇది 33.89 శాతంగా నమోదైందన్నారు. గురువారం వరకు 12,721 ఫారాలు డిజిటైజ్ చేయగా, శుక్రవారం ఒక్కరోజే 1,494 ఫారాలను డిజిటైజ్ చేసినట్లు వివరించారు. అదే రోజు 42 ఫారాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన ఫారాల పంపిణీ, డిజిటైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు.

## సెప్టిక్ ట్యాంకు కార్మికుల శిక్షణ కార్యక్రమం పూర్తి



**నెల్లూరు కార్పొరేషన్, జులై 3 ప్రభాతవార్త** :కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సమస్తే పథకం కింద ఎస్ఎస్‌కేఎఫ్‌డిసి సహకారంతో సంస్థ కమాండ్ కంట్రోల్ సెటర్‌లో మురుగనీటి, సెప్టిక్ ట్యాంకు కార్మికులకు ఐదురోజుల పాటు బ్యాచ్‌ల వారీగా శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడమైంది. శిక్షణను పూర్తి చేసుకొన్న వారికి కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం ప్రాంగణంలో శుక్రవారం శిక్షణ సర్టిఫికెట్లు, స్కోర్ కార్డులను కమిషనర్ వై..నందన్, ఈఈ చంద్రయ్య, ఏఈ నరేంద్ర ఇతర అధికారులు అందజేసి, శిక్షణను విజయవంతంగా పూర్తిచేసినందుకు వారిని అభినందించారు.

## చెట్లు ప్రగతికి మెట్లు



**బుచ్చి జులై 3 ప్రభాతవార్త** మన్యం వీరుడు, ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నం అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బుచ్చిరెడ్డి పాళెం మండలం పెనుబల్లిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆంగ్ల ఉపాధ్యాయులు చిట్టేటి వెంకట ఉమామహేశ్వరరావు ఆద్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చెట్లుకి జీవ కోటికి గల సంబందాన్ని వాటి ప్రాముఖ్యత గురించి మాట్లాడుతు పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పాఠశాల బోధనా సిబ్బంది, ఎ మునీంద్రబాబు,కెసదశివరావు, హైమ,రజనీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ చీదరాల చెన్నయ్య, విద్యార్దులు తదితరులు పాల్గోన్నారు.

## అన్నంబాకలో విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



**చిల్లకూరు, జులై 3, ప్రభాతవార్త** మండలంలోని అన్నంబాక గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద ప్రాథమిక పాఠశాల, అంగనవాడి ఫ్రీ ప్రైమరీ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు వారికి అవసరమైన పలకలు బలపాలను కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎంవి రావు ఫౌండేషన్ నిర్వాహకులు విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. చిరంజీవి ఎం.చిన్మయి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి సంయుక్తంగా పలకలు బలపాలు పంపిణీ అనంతరం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. హిందూ సాంప్రదాయానికి అనుగుణంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. తదుపరి ప్రస్తుత వేసవి సీజన్ కాలంలో వచ్చే అమ్మవారు చికెన్ ఫాక్స్ మరియు వేసవి వడగాలి తట్టుకునే విధంగా అవసరమైన హోమియో మందులను ముందస్తు జాగ్రత్త చర్యగా విద్యార్థులకు గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుట్టినరోజు జరుపుకుంటున్న చిన్మయికు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త బుజ్జమ్మ, స్థానిక ఉపాధ్యాయుడు ప్రసాదు, తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యాన్ని వెంటనే పునరుద్ధరించాలని మంత్రికి విద్యార్థుల అభ్యర్థన



**మర్రిపాడు,జులై3,ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలోని చుంచులూరు , పడమటి నాయుడుపల్లి పంచాయతీల నుండి నందవరం మోడల్ స్కూల్‌కు వెళ్ళే విద్యార్థుల సౌకర్యార్థం గతంలో ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి రద్దు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ సమయానికి పాఠశాలకు చేరుకోవడంలో ఇబ్బందులు పడడమే కాకఉండా ప్రవేటు వాహనాలపై అధిక వ్యయం భరించాల్సి వస్తోందని, కొంతమంది విద్యార్థులు చదువుకు కూడా దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు నుంచి నెల్లూరుకు వెళుతూ మార్గమధ్యంలో మర్రిపాడు వద్ద కొద్దిసేపు ఆగిన రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డినని నందవరం మోడల్ స్కూల్ విద్యార్థులు కలిసి బస్సు సౌకర్యాన్ని తక్షణమే పునరుద్ధరించాలని అభ్యర్థిస్తూ వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలుగకుండా సంబంధిత అధికారులతో మాటాల్డఇ బస్సు సౌకర్యాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, టిడిపి మండల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ప్రసూన సేవలు అభినందనీయం



నెల్లూరు, జులై 3, ప్రభాతవార్త - **విద్య** విధి నిర్వహణలో పావళ్ల ప్రసూన్న సేవలు అభినందనీయమని మానవసే వాటీం నిర్వాహకులు అరవ పరిమళ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక ఐఎంఎ హాలులో ఒంగోలు లోని రిమ్స్ నందు నర్సింగ్ సూప రింటెంట్‌గా ఆరోగ్య సేవలు అందించిన ప్రసూన పదవీ విరమణ పొంద టంతో ఆమేకు టీం నిర్వాహకులు ఘన సత్కారాన్ని గావించారు. శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రసూన కోవిడ్ సమయంలో చేసిన సేవలు అదర్శ ప్రాయమన్నారు. అలాగే కరోనా సమయంలో ఏర్పాటుచేసి మానవ సేవే మాధవ సేవ టీంలో ప్రస్తూన భర్త శ్రీనివాసులు అనేక ఆశ్రమాల్లో అన్నదాన, వస్త్రదాన వంటి సేవా కార్యక్రమానలు చేపట్టారని గుర్తుచేవారు. అంతటి సేవా గుణం కలిగిన వారి కుటుంబం సంతోషంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో సభ్యులు కల్లం శ్రీనివాసులు, మజహర్, రమేష్, గౌస్‌బాషా, ఖాదర్‌మస్తాన్, జయశ్రీ, పృద్వీ, లక్ష్మీ కాంతమ్మ, నాగరాజు, పద్మావతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌టీయు జిల్లా మూడవ మహాసభను విజయవంతం చేయాలి

**సైదాపురం, జులై 3, ప్రభాతవార్త :** ఐఎఫ్ టీయు జిల్లా మూడవ మహాసభను అన్ని రంగాల కార్మి కులు పాల్గొని విజయవంతం చేయాలని ఐఎఫ్ టీయు జిల్లా గౌరవ అధ్య క్షులు డీపీ పోలయ్య తెలిపారు. సైదాపు రంలో ఉన్న జిల్లా కార్యాల యంలో శుక్ర వారం మహాసభకు సంబంధించిన కరప త్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా



డీపీ పోలయ్య మాట్లాడుతూ గూడూరులోని రిటైర్డ్ అధికార భవనంలో జులై 15నాడు నిర్వహించే జిల్లా మూడవ మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ సంపదను సృష్టించే కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక వ్యతిరేకమైనవని వాటిని వెంటనే రద్దు చేయాలనిడిమాండ్ చేశారు. కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను ఈ కోడ్స్ ద్వారా హరించే కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ సమస్యలపై పోరాడేందుకు అవసరమైన నాయక త్వాన్ని రూపొందించుటకు మూడవ మహాసభలను నిర్వహించడం జరుగుతుందని ఈ సభలకు కార్మికులు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయు జిల్లా కార్యదర్శి కే.చెంగల్‌రావు, ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు మస్తానయ్య, నవకోటి, అనిల్, వెంకటం^మణయ్య, రత్నయ్య పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ వేగవంతంగా చేయండి సచివాలయం తనిఖీ చేసిన జెసి

**బుచ్చి జులై 3 ప్రభాతవార్త :** జిల్లాలో ఇప్పటి వరకు 97 శాతం ఎన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ జరిగిందని జాయిం ట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలి పారు. ఈ మేరకు పట్టణంలోని మున్సి పల్ కార్యాలయాన్ని ఆయన సందర్శిం చి సర్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. సర్ కార్యక్రమం వేగవం



తం అయ్యే చేసే విషయం కమిషనర్ చినబాబుతో చర్చించారు. అనంతరం 3 వ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు .రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 97 శాతంలో 36 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయిందని చెప్పారు. కోవూరు నియోజకవర్గంలో ఎన్యుమరేషన్ ఫామ్స్ 97.69 శాతం పంపిణీ చేయగా 38.4 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయిందని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 96 శాతం ఎన్యుమరేషన్ పామ్స్ పంపిణీ చేయగా 40 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. ఈనెల 14 వ తేది లోపు సర్‌ప్రక్రియను నూరు శాతం పూర్తి చేసే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, మండల తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.



## కావలి మున్సిపల్ కమిషనర్ బదిలీ

**కావలి, జులై 3 ప్రభాతవార్త :** కావలి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావన్‌కుమార్ శ్రీకాకుళం మున్సిపల్ కార్పోరేషన్‌కు బదిలీ అయ్యారు. అమరావతి సిఆర్‌డిఏలో విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ రషీద్‌ను కావలి మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది.

## అపరిశుభ్రంగా తాగునీటి బావి- కలుషితమవుతున్న తాగునీరు

**- ఆందోళన చెందుతున్న గ్రామప్రజలు**

**సైదాపురం, జులై 3, ప్రభా తవార్త :** మండల పరిధిలోని పోతేగుంట గ్రామంలో ఉన్న తా గునీటి బావి అపరిశుభ్రంగా ఉం టూ అత్యంత దయనీయ స్థితి లో ఉంది. దీంతో గ్రామస్తులు ఆ నీరు తాగితే ఏ రోగం వస్తుందో నని ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తుల వివరాల మేరకు.. పోతేగుంట గ్రామంలో సుమారు 400 కుటుంబాలు ఊరిలో నివసిస్తున్నారు. వీరికి తాగునీటి



ఎద్దడి తీర్చేందుకు ఆ ప్రాంతంలో అధికారులు తాగునీటి బావిని ఏర్పాటు చేశారు. అయితే ఆ బావి కొన్ని నెలలుగా అత్యంత దుర్గంధస్థితిలో ఉంది. బావి చుట్టూ పెరిగిన చెట్ల నుంచి ఆకులు, కొమ్మలు బావిలో పడిపోవడంతో నీరు అపరిశుభ్రంగా మారుతుంది. అలాగే బావిలో కప్పలు, పాములు, విషపురుగులు ఉం డటంతో నీరు మొత్తం పాచిపట్టిపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తాగేనీరు అపరిశుభ్రంగా ఉండడంతో ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బావిని పరిశుభ్రంగా చేసి ఎటువంటి అనారోగ్యాలకు గురి కాకుండా ప్రజలను కాపాడాలని వారు అధికారులను కోరుతున్నారు.

## ఈ పంట నమోదైతేనే ప్రభుత్వ పథకాలు ఎ.ఓ.ఎం. సుచ్చేంద్రప్రసాద్

**కోట, జులై 3 ప్రభాతవార్త :** మండలంలోని రైతులందరూ ఖచ్చితంగా తమ పంటలను ఈ పంట కింద నమోదు చేసుకోవాలని కోట మండల వ్యవ యాధికారి ఎం.సుచ్చేంద్ర ప్రసాద్ కోరారు. ఆయన శుక్రవారం తన కార్యాల యూంలో విలేకర్లతో మాట్లా డారు.రైతులు ప్రభుత్వం నుంచి ఏదైనా రాయితీపొందాలంటే ఈ పంటనమోదు అయి ఉండా లన్నారు. యూరియా కూడా రైతులకు ఈ తరహా లనే ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం యూరియా కొరత లేదన్నారు. భవిష్య త్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వ్యవసాయ సంబంధిత పథకాలకు ఈ పంటే ప్రామాణికంగా తీసుకోం టారని పేర్కొన్నారు. . వాలని వ్యవసాయా ధికారి సుచ్చేంద్ర ప్రసాద్ కోరా



రు. ఈ పంట నమోదును మండలంలోని రైతు సే వా కేంద్రాల్లో నమోదు చేస్తున్నారని చెప్పారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం,ఆధార్ నంబరు ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్ నంబరు వివరాలను రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి అందజేసి పేర్లు నమోదు చేస్తారని వివరించారు. పథకాలకు ప్రామాణికం పీఎం కిసాన్,అన్నదాత సుఖీభవ, ఎరువులు,విత్తనాల రాయితీ పంటల బీమా వ్యవసాయా రుణాలు వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు ఇలా అన్నింటికి ఈపంట నమోదు తప్పనిసరిని సుచ్చేంద్ర ప్రసాద్ తెలిపారు.

## ఓటరు సవరణ ప్రక్రియను పక్కగా నిర్వహించాలి తహిసీల్దార్ కె.జయజయరావు

**కోట,జులై 3ప్రభాతవార్త :** మండలంలో చేప్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రి యను పక్కగా చేపట్టాలని మండల తహి సీల్దార్,కెజయజయరావు కోరారు. ఆయన శుక్రవారం గూడలి, కొక్కపాడు, తదతర గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమంపై ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన బిఎల్‌వోలతో మా ట్లాడు తూ సర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యక్షంగా లేనివారు ( ఆబ్సెంట్ ) ఇతర



ప్రాంతాలకు వెల్లిన వారు (షిఫ్టెడ్) మరణించిన వారు (డెడ్) డూప్లికేట్ ఇతర రాష్ట్రాల కింద ఉన్న ఓటర్లు మినహా అందరూ ఓటరు జాబితలో ఉంటారని అటుంటి వారిని తొలగించాలని సూచించారు. సర్ ప్రక్రియ పై ఏటువంటి అపోహాలు అవసరం లేదన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి ఫారం 6 సమర్పించవచ్చని,తోలగింపునకు ఫారం 7 సవవరణలకు ఫారం 8 సమరిృంచవచ్చన్నారు.ఓటరుగా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఇంకా ఎవరికైనా అనుమనాలు ఉంటే తమ కార్యాల యూంలో హెల్ప డెస్క్ ఏర్పాటు చేసి ఉన్నామని ఓటర్లు నేరగా అక్కడకు వచ్చిన ఫారాలను పూర్తిచేసుకొచ్చాన్నారు.

## వైభవంగా ఆత్మారామస్వామి వారి ఏకాంతసేవ

**సంగం జులై 3 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో జరుగుతున్న ఆత్మా రామ స్వామి వారి బ్రహ్మోత్స వా లలో భాగంగా స్వామి వారి ఏ కాంత సేవ ఉత్సవం కన్నుల పం డుగా జరిగింది. స్వామి వారిని పరిమళ పుష్పాలతో అలం కరిం చారు. భక్తులు పెద్దఎత్తున పా ల్గొని గ్రామోత్సవంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈకార్య



క్రమానికి ఉభయకర్తలుగా కీర్తిశేషులు పచ్చిపాల రమణారెడ్డి కుమారులు వ్యవహారించారు.

## మృతుల కుటుంబాలకు టీడీపీ అండ ఎమ్మెల్యే

**కోట, జులై 3 ప్రభాతవార్త :** కోట మండలం చంద్రశేఖరపురం గ్రామం వద్ద గురువారం రాత్రి బస్సు ఢీకొన్న సంఘటనలో వంజివాక గ్రామానికి చెందిన శ్రీనాథ్, కేశవరానికి చెందిన శివకుమార్‌లు అక్కడికక్కడే మృతిచె ందారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోట ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుం బాలకు టీడీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి



భాస్కర్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్‌రెడ్డి, మధుయాదవ్, ఎం.సర్వో త్తమరెడ్డి, రమేష్, కోటేశ్వరరెడ్డి, జితేంద్రరెడ్డి, పోలయ్య, రఘురామ్, మేకల శ్రీనివాసులు, వెంకటకృ ష్ణారెడ్డి, చాపల శ్రీనివాసులు, చిన్నయ్య, తదితరులు ఉన్నారు.

## వీపీఆర్ నేత్ర సేవలు పూర్తిస్థాయిలో సద్వినియోగం





**కోవూరు, జులై 3 ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామ పంచాయతీలో శుక్రవారం వీపీఆర్ నేత్ర శిబిరాన్ని పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని వీపీఆర్ నేత్ర ద్వారా సామాన్య ప్రజానీకం సైతం ఉచితంగా సేవలు అందించేలా చర్యలు చేపట్టారన్నారు. ఇప్పటికే కోవూరు మండలంలో పలు గ్రామాల్లో ఈ వీపీఆర్ నేత్ర వైద్య శిబిరాలు పూర్తయ్యి శుక్రవారం లేగుంటపాడుకు చేరుకుందన్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు, కంటి అద్దాలను వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న వీపీఆర్ దంపతులు నెల్లూరు జిల్లాకు దొరకడం ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. రాజకీయాలకు రాకమునుపే వీపీఆర్ దంపతులు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. అనంతరం కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, మహిళా బ్యాంక్ సీఈవో ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## 5వరకు జనసేన పార్టీ కమిటీల దరఖాస్తుల స్వీకరణ

**నెల్లూరు,జులై3 ప్రభాతవార్త–విద్య :** తమ పార్టీకి చెందిన అనేకమంది నాయకులు, కార్యకర్తల సౌకర్యం కోసం జనసేన పార్టీ కమిటీల దరఖా స్తుల స్వీకరణ తేదీని రెండు రోజులు పొడిగిం చటం జరిగిందని, ఈనెల 5వ తేదీ సాయంత్రం వరకు ఆశావాహుల నుండి ధరఖాస్తులను స్వీకరిం చటం జరుగుతుందని జనసేన పార్టీ నరసాపు ర్‌ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ బొమ్మిడి నాయకర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని స్థానిక టౌన్‌హాల్‌లో



విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత మూడు రోజుల నుండి నగరంలోని స్థానిక పురమందిరంలో నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీల ఆధ్వర్యంలో ఆశావాహుల నుండి ధరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. దరఖాస్తు ఫారాలు ఇవ్వాల్సిన నేతలు ఎక్కువగా ఉండటంతో ముందుగా ఇచ్చిన మూడు రోజుల కాల వ్యవధిని పార్టీ కేంద్ర కార్యాలయ నిర్ణయం ప్రకారం ఐదు రోజులకు పెంచటం జరిగిందన్నారు. ఈనెల 5వ తేదీ వరకు ఆశావాహుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. అందరూ ఈ మార్పును గమనించి , సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జెసిని సన్మానించిన దళితనేత

**బుచ్చి జులై 3 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును దళితనాయకుడు సూదల వెంకటరమణయ్య,రిటైడ్ ఉపాధ్యాయుడు రఘునాధరావు శాలువా కప్పి సన్మానించారు. వీరి తోపాటు తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు , చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా , కమీష నర్ చిన్న



బాబు ఉన్నారు.ఈ సందర్భంగా సూదల రమణయ్య మాట్లాడుతు జాయింట్ కలక్టర్ మొగలి వెంకటేశ్వర్లుకి ఈ జిల్లాపైన మంచి పట్టు వుందని, ఆయన మన జిల్లాకు రావడం అదృష్టమని ప్రశంసిం చారు. ఈకార్యక్రమంలో పలువురు సచివాలయం సిబ్బంది ఉన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**గూడూరు, జులై 3, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గూడూరు నియోజకవ ర్గంలో ఇప్పటివరకు 6 కోట్ల 70 లక్షల రూపా యలు సీఎం సహాయ నిధి అందించడం జరిగిం దని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం



సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాడు అనారోగ్యంతో అప్పులు చేసి వైద్యం చేయించుకున్న వారికి సీఎం ఆర్థిక సహాయం బరోసా అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఒక్కరికి కూడా సీఎం సహాయ నిధి ద్వారా ఏమి ఇవ్వలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలలోనే ఆరు కోట్లకు పైగా సీఎం సహాయనిధి గూడూరు నియోజకవర్గంలో అందించామని తెలిపారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు .అనంతరం పేదలకు ఇంటి పొజిషన్ సర్టిఫికెట్ లను పంపిణీ చేశారు. శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వరరాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, ఎల్లసిరి శ్రీనివా సులు రెడ్డి, దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, చిట్టేటి శ్రీనివాసులు (కీరవాణి), కోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వవాహన ఉత్సవంలో ఆత్మారామస్వామి వారు

**సంగం జులై 3 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని ఆత్మారామస్వామి వారి సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మో త్సవాలలో భాగంగా స్వామి వారు పారువేటలో అశ్వవా హనంపైన భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని విశేష పూలతో అలంకరిం చారు. గ్రామోత్సవంలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తరిం చారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా బండా బలరామిరెడ్డి, స్పెసి పిక్ ఎండోమెంట్, బండా మల్లికార్జునరెడ్డి, కీర్తిశేషులు బండా నారాయ ణరెడ్డి, బండాహరికిషోర్‌రెడ్డి,శిద్దారెడ్డి సుధాకర్‌రెడ్డి వ్యవహారించారు .



## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసా

**కోవూరు, జులై 3 ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటు ంబాలకు ముఖ్యమంత్రి సహా యనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులోని కార్యాల యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి 26వ విడత చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 20 మంది లబ్ధిదారులకు రూ.8.38 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను




ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, అనారోగ్యం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మొత్తం 921 చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వాటి ద్వారా రూ.9.32 కోట్ల ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు.

## ఎన్.ఎస్.ఈ అకాడమీతో నారాయణ ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం



**నెల్లూరు, జులై 3, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన ప్రాయోగిక శిక్షణ, మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనలో మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోని ప్రముఖ ఆర్థిక శిక్షణ సంస్థలలో ఒకటైన ఎన్.ఎస్.ఈ అకాడమీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంపై నారాయణ ఇంజినీరింగ్ కళాశాల తరఫున ఎంబీఏ డీన్ డా. గంగినేని ధనంజయ్, ఎన్ఎస్ఈ అకాడమీ తరఫున ముఖ్య కార్యనిర్వాహణ అధికారి డా. అభిలాష్ మిశ్రా అధికారికంగా సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఈ అకాడమీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రంగనాథన్ పాల్గొన్నారు. ఈ భాగస్వామ్యంతో కళాశాలలో అత్యాధునిక సదుపాయాలతో ఎన్ఎస్ఈ స్మార్ట్ ఫిన్ ల్యాబ్/ ట్రేడింగ్ ల్యాబ్ ఏర్పాటు చేయబడనుంది. ఈ ట్రేడింగ్ ల్యాబ్‌లో అందుబాటులో ఉండే సిమ్యులేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా విద్యార్థులు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌పై ప్రత్యక్ష అనుభవాన్ని పొందగలరు. ముఖ్యంగా ఈక్విటీ మార్కెట్, నగదు మార్కెట్, డెరివేటివ్స్ మార్కెట్, కరెన్సీ మార్కెట్ల పనితీరును రియల్‌టైమ్ వర్చువల్ సిమ్యులేషన్ ద్వారా నేర్చుకునే అవకాశం లభిస్తుంది. విద్యార్థులకు వర్చువల్ నిధులు అందజేసి, ఎలాంటి ఆర్థిక నష్టం లేకుండా షేర్లు మరియు ఇతర సెక్యూరిటీల ట్రేడింగ్‌ను ప్రాక్టీస్ చేసే అవకాశం కల్పించబడుతుంది. దీని ద్వారా పెట్టుబడులు, మార్కెట్ విశ్లేషణ, ట్రేడింగ్ వ్యూహాలు, రిస్క్ నిర్వహణ, ఆర్థిక నిర్ణయ సామర్థ్యాలపై లోతైన అవగాహన పెరుగుతుంది. అంతే కాకుండా ఈ సహకారం ద్వారా విద్యార్థులకు ఆర్థిక సాంకేతికత, బ్లాక్‌చైన్ నిర్వహణ, డేటా సైన్స్, వ్యాపార విశ్లేషణ, యంత్ర అధ్యయనం, ఫైనాన్స్ కోసం పైథాన్, ఆర్థిక నమూనాల రూపకల్పన మరియు మూల్యాంకనం వంటి ఆధునిక అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించ బడుతుంది. ఎంబీఏ డీన్ డా. గంగినేని ధనంజయ్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కేవలం సిద్ధాంతపరమైన జ్ఞానం మాత్రమే సరిపోదు, ఆచరణాత్మక అవగాహన, పరిశ్రమ అనుభవం, సాంకేతిక నైపుణ్యాలు కూడా సమానంగా అవసరం. ఎన్ఎస్ఈ అకాడమీతో కుదిరిన ఈ భాగస్వామ్యం ద్వారా మా విద్యార్థులు ఆర్థిక మార్కెట్ల పనితీరుపై లోతైన అవగాహనతో పాటు ప్రత్యక్ష ట్రేడింగ్ అనుభ వాన్ని పొందగలరు. ఇది వారి ఉపాధి అవకాశాలను విస్తరించడమే కాకుండా, పెట్టుబడి సలహా సేవలు, ఆర్థిక విశ్లేషణ, స్వయం ఉపాధి రంగాల్లో రాణించే సామర్థ్యాన్ని మరింత పెంపొందిస్తుంది. పరిశ్రమ అవస రాలకు అనుగుణంగా విద్యార్థులను సమర్థ నిపుణులుగా తీర్చిదిద్దడమే మా ప్రధాన లక్ష్య అని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రవి ప్రసాద్, డైరెక్టర్ డా. దత్తాత్రేయ శర్మ, మేనేజ్‌మెంట్ ప్రతినిధి వై. వినయ్ కుమార్ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఈ అవగాహన ఒప్పందం విద్యార్థుల భవిష్యత్తు పురోగతికి, వృత్తిపరమైన అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

## కావలి ఎమ్మెల్యేను కలిసిన ప్రభుత్వ విప్ బొమ్మిడి

**కావలి, జులై 3 ప్రభాతవార్త :** జనసేన నిర్మాణ సారదుల సమాచార సేకరణ కమిటి నెల్లూరు పార్ల మెంటు పరిశీలకులు నరసాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొమ్మిడి నారాయణ కావలికి చేరిన సందర్భ ంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని మర్యా దపూర్వకంగా కలిసి పూలబొకేను అందజే యడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే బొమ్మిడి నారాయ ణకు స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరిం చడంజరిగింది. ఈకార్యక్రమంలో కాలి పట్టణ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్పెషల్ రివిజన్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**కోవూరు, జులై 3 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో శని, ఆదివారాలు రెండు రోజుల పాటు స్పెషల్ రివిజన్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని, వీటిని ఆయా పోలింగ్ బూత్ పరిధిలోని ఓటర్లు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్‌కు సంబంధించి ఓటర్లు ఫారాలు బీఎల్‌వోకు ఇవ్వకపోయినా మీ ఇంటికి బీఎల్‌వోలు రాకపోయినా.. ప్రస్తుతం అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు ఈ రెండు రోజుల పాటు తప్పక ఉంటారని, ఓటర్లు వచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోవూరు మండలానికి సంబంధించి 65889 ఓటర్లకు గానూ ఇప్పటివరకు 65018 మంది ఓటర్లకు బీఎల్‌వోలు ఫారాలు అందజేయడం జరిగిందన్నారు. 98 శాతం ఫారాలు పంపిణీ పూర్తయిందని, వీటికి సంబంధించి 27182 ఓటర్లను డిజిటలైజేషన్ చేయడం జరిగిందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ క్యాంపును వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



## ఐదుగురు బిఎల్‌ఓలకు షోకాస్ నోటీసులు

**– నెల్లూరు ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్ అనూష**

**నెల్లూరు, జులై 3, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** నెల్లూరు రూరల్ నియోజ కవర్గం పలు ప్రాంతాల్లో ఎస్ఐఆర్ నిర్వహణపై విస్తృత తనిఖీలు శుక్ర వారం చేశారు. విధి నిర్వహణలో అల సత్వం ప్రదర్శించిన ఐదుగురు బిఎల్ ఓలకు షోకాస్ నోటీసులు పంపారు.



నియోజకవర్గంలోని కోడూరుపాడు, నారాయణరెడ్డిపేట, వెంగళరావు నగర్, నాలుగో మైలు నవలాకుల గార్డెన్స్, దర్గామిట్ట ప్రాంతాలలోని సర్ కార్యక్రమాలను ఆమె తనిఖీ చేశారు. ఈ ప్రాంతాలలో విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన బిఎల్ఓలకు షోకాస్ నోటీసులు అందజేశారు. ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఎల్‌వోలు ఎన్నికల విధులకు సకాలంలో హాజరు కావడం, ఓటర్లకు అందుబాటులో ఉండడం, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణను వేగవంతం చేయడం, ఫారాలను సరైన విధంగా పూరించేలా ఓటర్లకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 18 ఏళ్ళు నిండిన వారికి ఓటు హక్కు కల్పించడం, ఓటర్లుగా కొనసాగుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడం తదితర విషయాలపై నిర్లక్ష్యం తగదన్నారు. ప్రతి పోలింగ్ బూత్ ఓటరు జాబితా ప్రచురణకు సంబంధించి ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్‌వోల పై ఉందన్నారు.

## రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

**నెల్లూరు, జులై 3, ప్రభాతవార్త – విద్య :** శుక్రవారం నగరంలోని స్థానిక హరనా ధపురంలో ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసి యేషన్ అమరావతి కార్యవర్గ సమా వేశన్ని రాష్ట్ర జనరల్ సెక్రెటరీ చేజర్ల సుధాకర్ రావు, కోశాధికారి హరిప్ర సాద్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. అనంతరం బాపట్ల జిల్లా లో హెల్త్ ఎడ్యుకేషన్ అధికారిగా



ఉత్తమ సేవలు అందించి గత నెలలో పదవీవిరమణ చెందిన వంకధార సుబ్బారావును అసోసియేషన్ సభ్యులు శాలువాలు కప్పి, ఘజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్రంలో నూతన జిల్లాల ఏర్పాటులో క్యాడర్ విభజన లో తమ వారికి నష్టం జరుగకుండా చూడాలని ఉన్నతాధికా రులను కోరారు. తమ అసోషియేషన్‌కు సుబ్బారావుఅన్నీ విధాల సహాయ సహకారాలు అందించారన్నారు. తోటి ఉద్యోగులతో సుబ్బారు సన్నిహితంగా ఉంటూ రాష్ట్ర అధికారుల మన్ననలు అందుకుని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధికారిగా గుర్తింపు సొంతం చేసుకున్నారని కొనియాడారు. ఆయన శేషజీవితం సంతోషంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు అంజమ్మ, కోటేశ్వరరావు, ధనుంజయ, రమాదేవి, అరుణకుమారి, ధర్మేంద్ర, అప్పలరాజు, ఇస్మాయిల్, సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి 125 రోజులు పనిదినాలు కల్పించాలి : డ్వామా పీడి శ్రీనివాసరావు

**సీతారామపురం జులై 3 ప్రభాతవార్త** నూతనంగా మార్పు చెందిన విబి–జి –రాంజీ పనులను నెల్లూరు డ్వామా పిడి శ్రీనివాసరావు ఆకస్మికంగా తనీఖీ చేశా రు. శుక్రవారం మండలంలోని బసినేని పల్లి పంచాయితీ పరిధిలో జరుగుతున్న ఉపాధీ పనులను తనీఖీ చేశారు.ఈ సందర్భంగా పనుల నాణ్యత పురోగతి



కూలీల హాజరు మస్టర్ రోల్స్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబం దిత అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అణుగుణంగా పనులను నాణ్యతతో పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి 25 రోజులు పనిదినాలు అదనంగా పెరిగాయని పనులకు వెల్లే ప్రతి కుటుంబానికి 125 రోజల పనిదినాలు కల్పించాలని అన్నారు.గతంలో కంటే కూలీ వేతనం పెరిగినందున ఉపాధీ కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా పని ప్రదేశంలో రెండు దశల పోటోలను ఎంఎం ఎస్ యాప్ ద్వారా తీయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ చిన్న చెన్నారావు, ఏపిఒ శ్యామలాదేవి, సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.